సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 20 । జూలై । 2024



గిరిజన ఉత్పత్తులకు ఆదరణ

ఆదివాసీ గిరిజనులు స్వశక్తితో తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఆదరణ రావాల్సి ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. 8లో



.. వ్యక్తిని ఆదుకోరూ

ఇంటి పెద్ద దిక్కుకు తలకు గాయమై కోమా లోకి వెళ్లగా, వైద్యం అందించేందుకు కుటుంబీకులు దాతల సాయం కోరుతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 24°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

సాక్షి ఫోన్ ఇన్

జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలు తమ సమస్యలను వివరించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈసందర్భంగా ఆయా మున్సిపాలిటీల ప్రజలు సీజనల్ వ్యాధుల నేపథ్యాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు ఓపెన్ ప్లాట్లు, ఖాళీస్థలాల్లో చెత్త నిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ల దృష్టికి తీసుకురావొచ్చు.

కొత్తగూడెంలో..



శేషాంజన్‌స్వామి, కమిషనర్

తేదీ : 20-07-2024, శనివారం
సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు
98499 05882, 99497 02944

ఇల్లెందులో..



బి. యాదగిరి, కమిషనర్

తేదీ : 20-07-2024, శనివారం
సమయం : ఉదయం 10-30 నుంచి 11-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
98499 05883

న్యూస్‌రీల్

అభ్యంతరాలు తెలపాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ వైద్య కళాశాలలో 155 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను జిల్లా అధికారిక వెబ్‌సైట్ http:// kothagudem. telangana. gov. in లో పొందుపర్చినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వి. విజేత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 5 తేదీ లోపు లిఖితపూర్వక ఆధారాలతో అందజేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

అశ్వాపురం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెలర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ భవనాల్లో మరుగుదొడ్లు, ఆట స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి సీతక్క ప్రకటించిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌పై జీఓ విడుదల చేయాలన్నారు. రిటైరైన టీచర్, హెల్పర్‌కు పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని కోరారు.

పెరుగుతున్న గోదావరి



భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం: భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. ఎగువన ప్రాజెక్టుల నుంచి వరద నీరు వస్తుండటంతో శుక్రవారం ఉదయం 24.5 అడుగుల వద్ద ఉన్న ప్రవాహం రాత్రి 10 గంటలకు 27.8 అడుగులకు చేరుకుంది. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద కూడా గోదావరి క్రమంగా పెరుగుతోంది. పర్ణశాలలోని సీతమ్మవారి నారచీరల ప్రాంతం అంతా నీటిలోనే మునిగి ఉంది.

అతలాకుతలం



గాండ్లగూడెం-నారాయణపురం మధ్య పెదవాగు వంతెన వద్ద పడిన భారీ గండి

ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. వరద ఉధృతికి చెరువు కట్టలు తెగిపోయాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. పశువులు మృత్యువాత పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వరద నీరు చేరింది. జనజీవనం అతలాకుతలమైంది. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో ఆ ప్రాంతంలో తీవ్ర నష్టం జరిగింది.

–అశ్వారావుపేటరూరల్

జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షం

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వరద ధాటికి చెరువులు, ప్రాజెక్టులకు గండ్లు
- కోతకు గురైన రోడ్లు, ఇళ్లలోకి చేరిన వరద
- భారీ సంఖ్యలో పశువుల మృత్యువాత, గల్లంతు

దెబ్బతిన్న పంటలు

అశ్వారావుపేట మండలం నారాయణపురం, గుమ్మడవల్లి, కొత్తూరు, బచ్చువారిగూడెం, నెమలిపేట, అనంతారం, గుర్రాల చెరువు, అచ్యుతాపురం, పాత నారంవారిగూడెం గ్రామాల్లో వరి 300 ఎకరాల్లో, పత్తి 250 ఎకరాల్లో, నిమ్మ 50 ఎకరాల్లో, మరో 60 ఎకరాల్లో పామాయిల్ పంటలు దెబ్బతిన్నాయి. వరద నీటితో పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేసింది. నిర్మల పుల్లారావు అనే రైతు మూడెకరాల నిమ్మతోట, మరో ముగ్గురు రైతుల పామాయిల్ మొక్కలు వేర్లతో సహా కొట్టుకుపోయాయి. ఇక డ్రిప్ పరికరాలు, పైపులైన్లు, మోటర్లు, ఫెన్సింగ్ వరదపాలయ్యాయి. అచ్యుతాపురం, గుర్రాల చెరువు కట్టలకు గండి పడింది. దెబ్బతిన్న పంటలను జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ, ఏడీఏ అఫ్జల్ బేగం, దమ్మపేట ఏఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ షాకిరా భాను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

విద్యుత్‌శాఖకు రూ.కోటి పైనే నష్టం

వర్షం, వరదలతో విద్యుత్ శాఖకు అపార నష్టమే మిగిలింది. విద్యుత్ తీగలు తెగిపడటంతోపాటు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దాదాపు 350 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. సుమారు 60 ట్రాన్స్‌ఫార్మర్లు వరదలో మునిగిపోగా, మరికొన్ని చోట్ల కింద పడిపోయాయి. 20 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. దీంతో అశ్వారావుపేట మండల కేంద్రం మినహా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు మరమ్మతులు చేపడుతున్నారు.

పశు సంపద గల్లంతు, మృత్యువాత

అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి భారీ గండ్లు పడటంతో ఒక్కసారిగా వచ్చిన వరదతో పశు సంపద గల్లంతైంది. ప్రాజెక్ట్ కట్టకు గండి పడగా, గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కట్టు బట్టలతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లను రక్షించుకునే సమయం కూడా లేకపోయింది. దీంతో అవన్నీ వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. కొన్ని పశువులు మాత్రం అటవీ ప్రాంతాలకు వెళ్లి సురక్షితంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన గిరిజన రైతు సరియం మల్లేష్ పెంచుకుంటున్న 70 గొర్రెలు, 15 ఆవులు, 2 గేదెలు వరద నీటిలో గల్లంతయ్యాయి.

ధ్వంసమైన రోడ్లు, వంతెనల వద్ద భారీ గండ్లు

వరద ధాటికి రహదారులు చాలా చోట్ల దెబ్బతినగా, వంతెనల వద్ద భారీ స్థాయిలో గండ్లు పడ్డాయి. నారాయణపురం-బచ్చువారిగూడెం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు అర కిలోమీటర మేర ధ్వంసమైంది. గుమ్మడవల్లి-కోయ రంగాపురం మధ్యలో ఉన్న హైలెవల్ వంతెనకు రెండు వైపులా గండ్లు పడ్డాయి. గాండ్లగూడెం-నారాయణపురం మధ్యలో కూడా రోడ్డు కోతకు గురైంది. అనంతారం వంతెన సమీపంలో, కేసీఆర్ డబుల్ ఇళ్ల కాలనీ వద్ద బీటీ రహదారి కొట్టుకుపోయింది. అనంతారం, కేసీఆర్ డబుల్ ఇళ్ల కాలనీలో వరద చేరి ఇళ్లు దెబ్బతిన్నాయి. పెదవాగు, చిన్న వాగుల ఉధృతికి అనంతారం పంచాయతీ కార్యాలయం నీట మునిగింది. సుమారు 30 కుటుంబాలు ఆందోళనకు గురై డాబాలపైకి ఎక్కారు. మరికొందరు ఎత్తైన ప్రదేశాలకు పరుగులు పెట్టారు.



నారాయణపురం-బచ్చువారిగూడెం మార్గంలో పూర్తిగా ధ్వంసమైన బీటీ రహదారి



నారాయణపురంలో ఓ రైతు పొలంలో భారీగా పేరుకుపోయిన ఇసుక మేటలు



అనంతారం గ్రామంలో పెదవాగు ఉధృతికి దెబ్బతిన్న రేకుల షెడ్డు

నిండా ముంచిన నిర్లక్ష్యం



వరద ఉధృతికి తెగిపోయిన పెద్దవాగు ప్రాజెక్ట్ కట్ట

- లోపాల పుట్టగా పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణ
- ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో కుంభవృష్టితో ముంచుకొచ్చిన వరద
- ముందుగానే ప్రాజెక్టు ఖాళీ చేయడంలో వైఫల్యం
- స్థానికులు అప్రమత్తం చేసినా మేలుకోని 'ఇరిగేషన్'
- భారీ వరదకు కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్టు
- భారీగా ఆస్తి, పంట నష్టాలు, దెబ్బతిన్న రోడ్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నలభై ఏళ్ల కిందట నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్టు.. నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల కారణంగా కోలుకోని నష్టం ఎదురైంది. ప్రాజెక్టు వరదలో కొట్టుకుపోగా, అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. రూ.కోట్లల్లో ఆస్తి నష్టం జరగ్గా, వందలాది మంది వరద బారిన పడ్డారు.

క్లౌడ్ బరస్ట్

పెద్దవాగు ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలో తెలంగాణలోని భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, ఏపీలోని బుట్టాయిగూడెం మండలాలు ఉన్నాయి. బుధ, గురువారాల్లో అశ్వారావుపేటలో 11 సెం.మీ., బుట్టాయిగూడెం మండలంలో 27 సెం.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. క్లౌడ్ బరస్ట్ కారణంగా గురువారం ఉదయం నుంచే పెద్దవాగులోకి భారీగా వరద చేరడం మొదలైంది. పెద్దవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 40,500 క్యూసెక్కులు కాగా గేట్ల వద్ద గరిష్ట నీటి మట్టం ఎత్తు 18 అడుగులుగా ఉంది. అప్పటికే కురిసిన వర్షాలతో బుధవారం సాయంత్రానికి 16 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగున కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయమే గేట్లు ఎత్తితే పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండేది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో వరద వెనక్కి మళ్లి, ప్రాజెక్టుకు ఎగువన 20 కి.మీ దూరంలో ఉన్న కావడిగుండ్ల గ్రామం వరకు ప్రభావం చూపింది.

హెచ్చరించినా...

వరద పెరుగుతోంది, ప్రాజెక్టు గేట్లు ఎత్తాలంటూ ఇరిగేషన్ అధికారులను గురువారం ఉదయమే స్థానికులు ఫోన్‌లో కోరినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉదయం 11గంటలు దాటినా గేట్లు తెరుచుకోకపోవడంతో తహసీల్దార్‌కు స్థానిక రైతులు సమస్యను వివరించారు. చివరకు మధ్యాహ్నం 12 గంటల సమయాన ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది గేట్లు ఎత్తేందుకు ప్రాజెక్టు దగ్గరకు వచ్చారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే పెరిగిన నీటి ఒత్తిడి కారణంగా గేట్లు వెంటనే పైకి లేవలేదు. మరికొందరు టెక్నీషియన్లను పిలిపించి ప్రయత్నించగా అతికష్టంపై రెండు గేట్లు ఎత్తగలిగారు. మూడో గేటు సగం తెరుచుకునే సమయానికి వరద నీరు మట్టికట్ట మీద నుంచి ప్రవహించడం మొదలైంది. ఈ వరద ఉధృతి చూసి భయపడి బతుకు జీవుడా అనుకుంటూ కొందరు టెక్నీషియన్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చివరకు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 70వేల క్యూసెక్కులకు పైగా ఉండగా ఔట్ ఫ్లో కేవలం 4వేల క్యూసెక్కులకే పరిమితమైంది. రెండింటి మధ్యన అంతరం భారీగా పెరిగిపోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయింది.

అంతర్రాష్ట్ర సమస్య

వరద తీవ్రత దాటికి 300మీటర్ల మేరకు మట్టి కట్ట కొట్టుకుపోయింది. ప్రాజెక్టులో నీరంతా దిగువకు వెళ్లిపోయింది. కేవలం కాంక్రీట్ నిర్మాణం, గేట్లు మాత్రమే మిగిలాయి. తాత్కాలిక మరమ్మతులకే కనీసం రూ.10 కోట్లు అవుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రాజెక్టును మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణలో ఉండగా మేజర్ ఆయకట్టు ఏపీలో ఉంది. దీంతో ప్రాజెక్టుపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. విభజన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేక ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతేడాది రూ.కోటి వెచ్చించి మరమ్మతులు చేసినా కీలక సమయంలో గేట్లు ఎత్తకపోగా.. చివరి నిమిషంలో పయత్నించినా ఫలితం కానరాలేదు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులుగా తేలిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ జిల్లా అధికారులు తెలిపారు.

ఆస్తినష్టం

పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని పదికి పైగా గ్రామాల్లో తీవ్ర ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు వరద విధ్వంసం కొనసాగింది. ప్రభావిత గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని రాత్రంతా గడిపారు. తెలంగాణ పరిధిలో పదుల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలోని ఫర్నిచర్, వంటసామగ్రి, గృహోపకరణాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు 650 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. పొలాలు, తోటల్లో ఇసుకమేటలు వేశాయి. వరద ఉధృతి కారణంగా అశ్వారావుపేట మండంలో పలు గ్రామాల మధ్య రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. విద్యుత్ స్తంభాలు కూలడం, తీగల తెగిపడడమే కాక ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోవడంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.కోటికి నష్టం వాటిల్లినట్టు అంచనా. శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక ఏర్పాట్లను పరిశీలించారు.

ఇరిగేషన్ అధికారులకు మెమోలు జారీ

అశ్వారావుపేటరూరల్: ముగ్గురు ఇరిగేషన్ అధికారులకు శుక్రవారం మెమోలు జారీ చేశారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటు కారణంగా భారీగా గండ్లు పడిన విషయం విదితమే. వరద అంచనా వేయలేకపోవడం, మూడో గేటు మొరాయించడంపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నీటి పారుదల శాఖ అధికారులపై శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి.. ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ, ఏఈఈ కేఎస్‌టీ కృష్ణకు మెమోలు జారీ చేశారు.

మునగ సాగు చేయించండి

అశ్వారావుపేట: వర్షాలు, వరద ముంపుతో నష్టపోతున్న నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా మునగ సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శుక్రవారం అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టు గండి పరిశీలించేందుకు వచ్చిన ఆయన నారాయణపురం క్లస్టర్ ఏఈవో షాకిరా భానుకు మునగ పంట గురించి చెప్పారు. ఉచితంగా మునగ విత్తనాలను అందిస్తామన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు ఎంపీడీఓలు, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామస్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని ప్రాజెక్టుల వద్ద ఇసుకబస్తాలు అందుబాటులో ఉంచాలని, ప్రాజెక్ట్ గేట్లు తెరిచే ముందే పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. దెబ్బతిన్న బ్రిడ్జిలకు మరమ్మతులు నిర్వహించాలని, వరద సాయానికి కావాల్సిన పనిముట్లు, లైట్లు, మైకులు, బోట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

అశ్వారావుపేట: రానున్న రెండు రోజులు కూడా భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. వరద తాకిడికి తెగిపోయిన గుమ్మడవల్లి(పెద్దవాగు) ప్రాజెక్ట్‌తోపాటు జిల్లాలోని పలు జలాశయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వరద ముంపునకు గురైన పంట పొలాలను, నివాస గృహాలను పరిశీలించారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ ఇతర శాఖల సమన్వయంతో అప్రమత్తంగా ఉంటుందని.. అత్యవసరంలో 100కు ఫోన్ చేయాలని సూచించారు. గురువారం నారాయణపురం వద్ద వరదలో చిక్కుకుపోయిన 40 మంది కూలీలను 26 మందిని హెలికాప్టర్ ద్వారా 14మంది డీడీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారని.. వారికి అభినందనలు తెలిపారు.

402 అడుగులకు కిన్నెరసాని..



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయంలోకి వరదనీరు పోటెత్తుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్ నీటిమట్టం శుక్రవారం 402.40 అడుగులకు పెరిగింది. ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో నుండగా, ఒక గేటు ఎత్తి ఉంచి అదే స్థాయిలో ప్రాజెక్ట్ నుంచి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. నదీ దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

59 వేల క్యూసెక్కులు విడుదల..



తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ నుంచి తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం కూడా ప్రాజెక్ట్‌కు చెందిన 25 క్రస్ట్ గేట్లలో 24 గేట్లు ఎత్తి 59,330 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తాలిపేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని నీటిమట్టాన్ని 72.22 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.

అలుగు పోస్తున్న 'మూకమామిడి'



మత్తడి పోస్తున్న మూకమామడి ప్రాజెక్ట్

ములకలపల్లి: మూకమామిడి మధ్యతరహా ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి జలాశయంలో చేరింది. దీంతో పూర్తిగా నిండి అలుగుపోస్తోంది. శుక్రవారం ఎగువన ఉన్న వాగుల నుంచి వచ్చే వరద ప్రవాహం అధికంగా ఉండడంతో, అవుట్ ఫ్లో దిగువకు పరవళ్లు తొక్కుతోంది. ఇంకా ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది.

క్లుప్తంగా

గిరిజన క్రీడాకారుడికి ఐటీడీఏ చేయూత



వంశీకి చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గిరిజన క్రీడాకారుడికి ఐటీడీఏ తరఫున చేయూతనిచ్చారు. ప్రస్తుత ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడేనికి చెందిన మోడెం వంశీ పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ పోటీల్లో సత్తా చాటడమే కాక ఐరోపా ఖండంలోని మాల్టా దేశంలో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అయితే, పోటీలకు వెళ్లాలంటే ప్రతీ క్రీడాకారుడు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు రూ.2.10 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో అంత స్థోమత లేని వంశీ భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ నిర్వాహకులు, అసోసియేషన్ బాధ్యులతో కలిసి ఐటీడీఏ పీఓ రాహుల్‌ను సంప్రదించారు. ఈ నేపథ్యాన ఆయన ఐటీడీఏ తరఫున శుక్రవారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్‌తో పాటు భోగాల శ్రీనివాస రెడ్డి, జీవీ రాంరెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, మహంతి వెంకటకృష్ణ, శోభానాయక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మిక సమస్యలపై పోరాడుతాం

టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్



రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేశ్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రమేశ్‌ను శుక్రవారం పాల్వంచలోని యూనియన్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల జీపీఎఫ్‌ను ఈపీఎఫ్‌గా మార్చడం, కొత్త పోస్టుల మంజూరు, ఆర్టిజన్లకు పదోన్నతులు, మిగిలిన కార్మికులను ఆర్టిజన్లుగా భర్తీ చేయడం తదితర సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అలాగే, జేఏసీ ఏర్పాటు చేసి సంస్థపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. టీఆర్‌వీకేఎస్ నాయకులు దంచనాల రాంబాబు, రాసూరి శ్రీను, ముత్యాల రాంబాబు, సాధిక్‌పాషా, కె.రవికుమార్, సుభాని, సంతోష్‌రెడ్డి, మల్లెల వీరనారాయణ, నాదెళ్ల రవికుమార్, సందుపట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయినా రిలీవ్ చేయడం లేదు




మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు నరేశ్

పినపాక: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తనకు అనుమతులు వచ్చినప్పటికీ ఎంఈఓ తనను రిలీవ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తోగ్గూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరేశ్ ఆరోపించారు. శుక్రవారం పినపాక మండలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన బదిలీకి సంబంధించిన లేఖను విడుదల చేశాడు. నిబంధనల మేర చేస్తున్నామని చెబుతున్న ఎంఈఓ అర్హతలేని వారిని రిలీవ్ చేస్తూ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ఎంఈఓను 'సాక్షి'వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులకు లోబడి రిలీవ్ చేస్తున్నామని తెలిపారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

వేంసూరు/దమ్మపేట: పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు తీసుకున్న అర్హులైన ప్రతీ రైతుకు మాఫీ అవుతుందని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వేంసూరు మండలం మర్లపాడు, దమ్మపేట డీసీసీబీ బ్రాంచ్‌లను శుక్రవారం సందర్శించిన ఆయన పీఏసీఎస్‌ల చైర్మన్లతో మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ అవుతుందని తెలిపారు. కాగా, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణాలు మంజురు చేయడంతో పాటు ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాగా, దమ్మపేటలో చైర్మన్‌ను సత్కరించి బ్యాంకు ద్వారా రైతులకు త్వరగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్లు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, గంధ్ర సోమిరెడ్డి, కూరపాటి నాని, గడ్డం అంజిరెడ్డి, కాటే జమలరావు, ఎల్లిన రాఘవరావు, బ్యాంకు మేనేజర్ నాగభూషణం, నాయకులు రావు గంగాధరరావు, దొడ్డా ప్రసాద్, ఎర్రా వసంతరావు, యర్రగొర్ల రాధకృష్ణ, సొసైటీ సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

కంటి మీద కునుకు లేదు..

- రాత్రంతా ఇళ్లపైనే జనం..
- బడులు, గుడులు, దేవుడే దిక్కు..



కొత్తూరులోని ఓ ఇంటి ఆవరణలో బురద

అశ్వారావుపేట: పెదవాగు 'గుమ్మడవల్లి ప్రాజెక్టు' కట్ట తెగి గుమ్మవల్లి, కొత్తూరు గ్రామాల్లోకి గురువారం సాయంత్రం వరద నీరు వచ్చి చేరడంతో గ్రామ శివారులోని సుమారు 40 నివాస గృహాల్లోకి నీరు పోటెత్తింది. ఇళ్లలోని పశుపక్షాదులు, వంట సామగ్రి, సరుకులు వరదలో కలిసిపోయాయి. గ్రామస్తులు కొత్తూరు, ప్రాజెక్టు క్యాంపు, గుమ్మడవల్లి పాఠశాల వంటి ఎత్తయిన ప్రదేశాలకు పరుగులు పెట్టారు. గురువారం రాత్రి అధికారులు కొందరిని ప్రాజెక్టు క్యాంపులోని ఆశ్రమ కాలేజీకి తరలించి భోజన ఏర్పాట్లు చేసినప్పటికీ కట్ట తెగి వరద ఉధృతి తగ్గడంతో తిరిగి అదే రాత్రి తిరుగుపయనమయ్యారు. కొత్తూరు గ్రామానికి ఒక వైపు గుమ్మడవల్లి ప్రాజెక్టు కుడి కాలువ.. రెండో వైపు వరద కాలువ ఉన్నాయి. గండి పడటంతో రెండూ కాల్వల నీరు ఏకమై సాయంత్రం 6 గంటల సమయంలో ఊర్లోకి వచ్చింది. గురువారం రాత్రి నీటి మట్టం పెరుగుతుండటంతో సమీప గ్రామాలకు బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. డాబా ఇళ్లున్న వారు కొందరు మేడ మీదకు ఎక్కి తెల్లారే వరకు చినుకుల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కంటి మీద కునుకు లేకుండా ఎదురుచూశారు. తెల్లారిన తర్వాత వరద ఉధృతి తగ్గడంతో ఇళ్లలోకి వచ్చారు. కొత్తూరు గ్రామంలో ప్రహరీ ఎత్తుకు వరద నీరు వచ్చి చేరడంతో ఇళ్లలోని వంట పాత్రలు, బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత తడిసి ముద్దయ్యాయని వాపోతున్నారు. అయితే, గురువారం రాత్రి పరిస్థితి చేయి దాటాక పడవలు పంపుతాం వస్తారా..? అని అధికారులు అడిగారని, గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో ఇళ్లలోకి నీళ్లు వచ్చాయని.. వరదనీరు వచ్చి చేరుతున్నపుడు సైరన్ మోగించడంలో ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు నిర్వహించి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కొత్తూరులో తడిసిన బియ్యం బస్తాలు

సర్వం తడిసి పోయాయి



వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నీ తడిసి పోయాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా వరద నీరు నాలుగు వైపుల నుంచి ఇంట్లోకి వచ్చేసింది. సామగ్రి సదురుకునే సమయం కూడా దొరకలేదు. నిమిషాల్లో ఇంట్లోకి నీళ్లు వచ్చేశాయి. వెంటనే ఇంటిపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాం.

– శివాజీ, కొత్తూరు

ఇలాంటి వరద చూడలేదు



ఇన్నేళ్లలో నేనెపుడూ ప్రాజెక్టు నుంచి ఇంత వరద చూడలేదు. ప్రాజెక్టు తెగేదాకా అధికారులెవరూ మమ్మల్ని హెచ్చరించలేదు. వరద సంగతి తెలిసిన మా అబ్బాయి వచ్చి మమ్మల్ని తీసుకుపోయాడు. ఇంట్లో మొత్తం వరదనీరే. బియ్యం, సామగ్రి తడిసి ముద్దయిపోయాయి. వరద నీరు వస్తుంటే భయమేసింది.

– బొల్లి వెంకటరమణ, కొత్తూరు

ఇల్లు కూలింది..



వరద నీరు ఇంటిమీదకు వచ్చేస్తోంది. అందరూ కేకలు పెడుతూ పరుగెడుతున్నారు. వచ్చి చూస్తే ఇంట్లోకి నీళ్లు వచ్చి చేరాయి. అందరితోపాటు నేనూ పరుగులు పెట్టాను. తెల్లారి వచ్చి చూస్తే ఇంటి గోడ పడిపోయింది. ఇంట్లో సామగ్రి మొత్తం వరదలో కొట్టుకుపోయింది. ఇల్లంతా బురదగా తయారైంది. తిన్నావా..? అని అడిగిన వారు లేకుండా పోయారు.

– ఉప్పతల వెంకమ్మ, గుమ్మడవల్లి

కట్టుబట్టలతో మిగిలాం



వర్షం వచ్చినపుడు ప్రాజెక్టు నీళ్లు ఎప్పుడూ మా ఇంటి మీదకు రాలేదు. కాకుంటే బచ్చువారిగూడెం ఊర చెరువు కట్ట తెగడంతో మా ఊరి మీదకు వరదనీరు వచ్చింది. అందరితోపాటు మేమూ వెళ్లిపోయాం. పిల్లల పుస్తకాలు, బట్టలు, ఇంటి సామగ్రి మొత్తం కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలాం.

– వీరబాబు, భవాని, గుమ్మడవల్లి

బాధితులను ఆదుకుంటాం..




మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: గుమ్మడవల్లి ప్రాజెక్టు వరద బాధితులు, బాధిత రైతులను తప్పక ఆదుకుంటామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలైన గుమ్మడవల్లి, రంగాపురం, మేకలబండ, నారాయణపురం, బచ్చువారిగూడెం, కొత్తూరు గ్రామాల్లో ఎస్పీ, కలెక్టర్‌తోపాటు ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు, నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి పాఠశాలల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నామని.. అధికారులు చొరవ తీసుకుని ఎవరికీ అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. ఇప్పటికిప్పుడు ప్రాజెక్టును పునరుద్ధరించలేమని, తుఫాన్ తగ్గిన తర్వాత ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రభుత్వంతో చర్చించి శాశ్వత, పటిష్టమైన ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. విద్యుత్ లైన్ల పునరుద్ధరణ మొదలైందని.. గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని, రంగాపురం బ్రిడ్జి వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని సరిచేయిస్తున్నామని వెల్లడించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్‌బాబు, తిరుపతిరావు, జల్లిపల్లి శ్రీరామమూర్తి తదితరులున్నారు.

కోమాలో ఉన్న వ్యక్తిని ఆదుకోరూ..

- మూడు నెలల క్రితం పడిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు
- ఇప్పటి వరకు రూ.23లక్షలు ఖర్చు.. చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబం
- ముగ్గురు ఆడ పిల్లలే కావడంతో చుట్టుముట్టిన ఆర్థిక సమస్యలు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు, పక్కన భార్య, ముగ్గురు కూతుర్లు

పాల్వంచ: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. అనుకోకుండా ఇంటికి పెద్ద దిక్కు కిందపడి తలకు గాయం కావడంతో కోమాలోకి వెళ్లడంతో అతడికి మూడు నెలలుగా వైద్యం అందిస్తున్నారు. ఉన్న డబ్బంతా వైద్యానికే ఖర్చు చేశారు. ఇక చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని మంచికంటినగర్‌కు చెందిన లాకావత్ రాంబాబు కొన్నేళ్ల కిందట బతుకుదెరువు కోసం గేటు కారేపల్లి నుంచి బీసీఎంరోడ్‌లో కేఎస్ఎం వద్ద చిన్నపాటి దాబా హోటల్ కిరాయికి తీసుకుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య సునీత, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సొంత ఇల్లు కూడా లేదు. మూడు నెలల కిందట ఇంట్లో పనిచేస్తున్న సమయంలో అనుకోకుండా కళ్లు తిరిగి కిందపడటంతో తలకు గాయమైంది. ఆస్పత్రిలో తలకు ఆపరేషన్ చేసి సుమారు 60 కుట్లు వరకు వేశారు. హైదరాబాద్, ఖమ్మం ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. ప్రస్తుతం కొత్తగూడెంలో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇప్పటి వరకు రూ.23 లక్షల వరకు ఖర్చు

రాంబాబు అనారోగ్యానికి గురి కావడంతో ఇప్పటి వరకు రూ.23 లక్షల వరకు ఖర్చు చేశారు. అతను ఆస్పత్రిలో చేరినప్పటి నుండి హోటల్ కూడా నడపడం లేదు. అందిన కాడ అప్పులు చేసి వైద్యానికి ఖర్చు చేశారు. దీంతో డబ్బులు ఇచ్చిన వారి నుంచి కూడా డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి పెరుగుతోంది. అయినా రాంబాబు ఇంకా కోలుకోకపోగా చికిత్సలోనే ఉన్నాడు. పెళ్లీడుకొచ్చిన ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఇంక వైద్యానికి ఎంత ఖర్చు అవుతుందో కూడా అర్థం కాని పరిస్థితి. చేతిలో చిల్లిగవ్వ కూడా లేక పరిస్థితి నుంచి గట్టెక్కే మార్గం లేక ఆందోళన చెందుతున్నారు. ఎవరైన దాతలకు తమకు సహాయం చేస్తే తప్ప ముందుకు వెళ్లలేని దీనావస్థలో ఇబ్బంది పడుతు న్నారు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వివరాలకు సెల్ నంబర్ 96764 60471లో సంప్రదించాలని, అదే నంబర్‌కు ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీ వద్ద ఓ వ్యక్తి మద్యం మత్తులో విలేకరినంటూ హల్‌చల్ చేశాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మాచినేనిపేటకు చెందిన ఓ వ్యక్తి దెబ్బతగిలిందని వైద్యం కోసం వచ్చాడు. ఓపీ ఎక్కువగా ఉండటంతోపాటు పలువురు వైద్యసిబ్బంది సెలవులో ఉండటంతో వైద్యసేవలు కొంత ఆలస్యమయ్యాయి. ఈ క్రమంలో సదరు వ్యక్తి వైద్యసిబ్బందితో ఘర్షణకు దిగడంతోపాటు సెల్‌ఫోన్‌తో వీడియో తీశాడు. వైద్యపరీక్షల కోసం క్యూలైన్‌లో నిలబడ్డ రోగులతోపాటు డాక్టర్‌ను వీడియో తీయడంతో అక్కడ ఉన్న సిబ్బంది గమనించి వీడియో ఎందుకు తీస్తున్నావని అడిగితే విలేకరినని చెప్పాడు. తమ అనుమతి లేకుండా వీడియో ఎందుకు తీస్తున్నావని డాక్టర్, వైద్యసిబ్బంది ఆ వ్యక్తిని ప్రశ్నించడంతో అతడు వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నలుగురు వైద్యులు బదిలీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియాస్పత్రిలోని నలుగురు వైద్యులను శుక్రవారం ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దంత వైద్యుడిగా పనిచేస్తున్న యుగంధర్‌ను మణుగూరు, పిల్లల వైద్యుడు క్రాపా విజయ్‌ను పాల్వంచ, ఈఎన్‌టీ వైద్యుడు ప్రవీణ్‌ను హైదరాబాద్ పరిధి కొండాపూర్, పిల్లల వైద్యుడు రాజశేఖర్‌రెడ్డిని కోదాడ ప్రభుత్వాస్పత్రులకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సూపరింటెండెంట్ కేదర్‌తో పాటు మరికొందరు వైద్యులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. అశ్వారావు పేట నుంచి సత్తుపల్లి వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి.. రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతినగా, ఆర్టీసీ బస్సులో ఉన్న ఐదుగురు ప్ర యాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడిన ఆర్ఎంపీ



సీపీఆర్ చేస్తున్న గ్రామీణ వైద్యుడు

అశ్వారావుపేటరూరల్: గుండెపోటుకు గురై అపస్మారకస్థితిలో పడిఉన్న ఓ పశువుల కాపరిని గ్రామీణ వైద్యుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లికి చెందిన చందు పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం కూడా పశువులను మేత కోసం తిమ్మాపురం వైపు తీసుకెళ్తూ, మార్గమధ్యలో గుండెపోటుకు గురై రోడ్డుపక్కన కిందపడిపోయాడు. అదే సమయంలో నారాయణపురంనికి చెందిన గ్రామీణ వైద్యుడు పున్నయ్య ద్విచక్రవాహనంపై అశ్వారావుపేటకు వచ్చే క్రమంలో కిందపడి ఉన్న చందును చూసి అతని వద్దకు వెళ్లి తక్షణమే సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడి, అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆస్పత్రిలో చికిత్స చేసిన తర్వాత మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

మేకల చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

పాల్వంచరూరల్: మేకల చోరీ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాండురంగాపురంలో నెలరోజుల కిందట రెండు మేకలు చోరీకి గురయ్యాయి. మేకల యజమాని ఎల్లావుల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

కరకగూడెం: అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన దుర్గం దుర్గ (45) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి కొండగొర్ల దొడ్డయ్య శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

గుండాల: ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలిక మృతి చెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. అనంతోగు గ్రామానికి చెందిన ఓకే అక్షితకు ఏడాది కిందట జ్వరంతోపాటు ఒంటిపై దద్దుర్లు రావడంతో కొత్తగూడెం ఆస్పత్రిలో వైద్యం అందించారు. పలు ఆస్పత్రులకు తీసుకువెళ్లినప్పటికీ వ్యాధి నయం కాలేదు. అప్పటి నుంచి తగ్గకపోగా రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. ఇటీవల కాలంలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందింది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన గేదెల వద్ద మట్టపర్తి మంగమ్మ

దమ్మపేట: మేతకువెళ్లిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని శ్రీరాంపురం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన మట్టపర్తి మంగమ్మకు చెందిన రెండు గేదెలు, శుక్రవారం అదే గ్రామ శివారులో మేత మేస్తున్నాయి. ఆ ప్రాంతంలో విద్యుత్ ప్రసారం జరుగుతున్న ఓ స్తంభాన్ని తాకిన గేదెలు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.1,40,000 ఉంటుందని బాధితురాలు తెలిపారు.

గిరిజన ఉత్పత్తులకు మరింత ఆదరణ

- కళారూపాల తయారీలో ప్రతిభతో ఆదాయం
- ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు



మేళాలో ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు

భద్రాచలం: ఆదివాసీ గిరిజనులు తయారు చేస్తున్న కళారూపాలకు మరింత ఆదరణ రావాల్సి ఉందని భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భద్రాచలంలోని గిరిజన భవన్‌లో ట్రైఫెడ్, ఐటీడీఏ ఆధ్వర్యాన గురువారం గిరిజనుల హస్తకళలు, అటవీ, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించా రు. ఈ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. సొసైటీల ద్వారా జీవనోపాధి కోసం హస్తకళలను ఎంచుకోవడం అభినందనీయమని, తద్వారా మరికొందరికి భరోసా కల్పించినట్లవుతుందని తెలిపారు. ఈ ఉత్పత్తులను ట్రైఫెడ్ కొనుగో లు చేసి విక్రయిస్తే ఆదరణ పెరుగుతుందని, ఈ విషయంలో దళారులు, మధ్యవర్తుల బారిన పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజన మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ట్రైఫెడ్ కృషి చేయాలని సూచించారు. మేళాను సందర్శించిన ఆయన కొందరికే పరిమితమైన ఉత్పత్తులను రాష్ట్రంలోని అనిచోట్ల విక్రయించేలా చూడాలన్నారు. ట్రైఫెడ్ రీజినల్ మేనేజర్ సంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. గిరిజన మహిళలకు చేయూతనిచ్చేందుకు పీఎం జన్మన్ పథకం అమలవుతోందని, ఇక్కడి గిరిజనులు రూపొందించిన ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల్లో విక్రయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, వివిధ శాఖల అధికారులు సురేశ్‌బాబు, దావీద్, నర్సింహులు, రాంబాబు, అశోక్, రమణయ్య, కరీం, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరురూరల్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీలు ఇచ్చి, అధికారంలో వచ్చాక కొన్నింటినే అమలు చేస్తోందని విమర్శించారు. కొత్తగూడెంలో ఓ వృద్ధురాలికి రూ.1.70 లక్షల పెన్షన్ డబ్బులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం నోటీస్ ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. నోటీస్ ఇవ్వాల్సింది వృద్ధురాలికి కాదని, 70 లక్షల మంది రైతులకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి అని పేర్కొన్నారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ దెబ్బతిన్నదని, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పట్టించుకోవడంలేదన్నారు. మరమ్మతులు చేయించలేనని ఎమ్మెల్యే రాతపూర్వకంగా రాసిస్తే.. రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తాను రూ.2.40 లక్షలతో మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ముద్దంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరచారి

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి ఆదేశించారు. మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చెప్పాలని, తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులలో కనీస సామర్థ్యాలు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం మండలంలోని భవిత కేంద్రాన్ని పరిశీలించి దివ్యాంగులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కేజీబీవీని సందర్శించి పదో తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. విద్యార్థినులకు గ్లాసులు, ప్లేట్లు, కార్పెట్లు, బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీశ్ కుమార్, మండల నోడల్ అధికారి యదుసింహరాశి తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షంతో ఆందోళన

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు వానకోసం ఎదురుచూసిన కర్షకులు గురువారం నుంచి కురుస్తున్న అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటాయని వాపోతున్నారు. వర్షపాతం అధికమైతే మొలకెత్తే దశలో ఉన్న, మొలకెత్తిన పంటలు నీట మునిగి కుళ్లిపోతాయని పేర్కొంటున్నారు. వందల ఎకరాల్లో వరి, పత్తి, పామాయిల్ తదితర పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో వానకాలం సీజన్‌లో సాగు 84 శాతం చేపట్టారు. మిగిలిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తుండగా, రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షానికి పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు కూడా 30.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అశ్వారావుపేటలో అత్యధికంగా 152.4 మి.మీ, దమ్మపేటలో 108.6, చర్లలో 59.2 అన్నపురెడ్డిపల్లిలో 45.2 చండ్రుగొండలో 30.8 సుజాతనగర్‌లో 29.8, దుమ్ముగూడెం 24.2, పినపాక 26.2, కరకగూడెం 23.0మి.మీ, జిల్లాలో మొత్తం 710మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా ఆయా శాఖల అధికారులు వరద నష్టం అంచనా వేస్తున్నారు.

కేసు నమోదు

కొత్తగూడెంరూరల్: అప్పు తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించడానికి వెళ్లిన మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడి చేసేందుకు యత్నించాడు. ఈ ఘటనపై శుక్రవారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. హేమచంద్రపురం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అదే గ్రామానికి చెందిన మహిళకు కొంత నగదు అప్పుగా ఇచ్చాడు. దానిని తిరిగి చెల్లించడానికి సదరు మహిళ ప్రజాప్రతినిధి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంతో ఆయన మహిళపై లైంగికదాడి చేసేందుకు యత్నించాడు. తప్పించుకొని ఇంటికి వెళ్లి తన భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.